సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 16 । మార్చి । 2023



తాగునీటి ఎద్దడి రావొద్దు

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ కోరం కనకయ్య సూచించారు. 8లో



వెండితెరపై 'గుమ్మడి' బయోగ్రఫీ

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య జీవిత చరిత్ర ఇతివృత్తంగా 'గుమ్మడి నర్సన్న' పేరుతో సినిమా రూపొందిస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 21°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదైనా.. మధ్యాహ్నం తర్వాత వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం బేడా మండపంలో స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం

సింగరేణి(కొత్తగూడెం): 2023 – 24 సంవత్సరానికి గాను జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఎన్నికల అధికారులను బుధవారం నియమించారు. ప్రధాన ఎన్నికల అధికారిగా పలివెల సాంబశివరావు, సహాయ అధికారులుగా మెండు రాజమల్లు, జీకే అన్నపూర్ణ, పాల రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు. బార్ అసోషియేషన్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లను వీరు స్వీకరించనున్నారు.

హక్కులకు భంగం కలిగితే ఫిర్యాదు చేయొచ్చు



మాట్లాడుతున్న జూలూరి రఘుమాచారి

కొత్తగూడెంఅర్బన్: ప్రతి వినియోగదారుడు కొనుగోలు చేసే వస్తువుల్లో నాణ్యమైనవి, నమ్మకమైనవి ఉండాలని, అలా పొందడం వారి హక్కు అని తెలంగాణ వినియోగదారుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు జూలూరి రఘుమాచారి అన్నారు. వినియోగదారుల హక్కులకు భంగం కలిగితే జిల్లా, రాష్ట్ర, జాతీయ ఫోరాలలో ఫిర్యాదు చేసి తగిన నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపార రంగంలో నిరంతరం కొనసాగుతున్న దోపిడీ నుంచి వినియోగదారులను కాపాడేందుకు రక్షణ చట్టాలు ఆవిర్భవించాయని చెప్పారు. వినియోగదారులు వారు కొనే వస్తువులకు, పొందే సేవలకు బిల్లులు తప్పని సరిగా భద్రపరుచుకోవాలని సూచించారు. సమావేశంలో ఫోరం నాయకులు చంద్రశేఖరాచారి, ఎల్లయ్య, రమేష్, నాగేశ్వరరావు, గోవిందాచారి, శ్రీనివాస్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

'పేట' విద్యాశాఖకు ప్రపంచ రికార్డు



రికార్డు పత్రాన్ని ఎంఈఓకు అందజేస్తున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మండల విద్యాశాఖకు ప్రపంచ రికార్డు దక్కింది. ఈ మేరకు రికార్డు పత్రాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి చేతుల మీదుగా స్థానిక ఎంఈఓ పి.కృష్ణయ్య అందుకున్నారు. గతేడాది డిసెంబర్‌లో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యుల ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో ఒకేసారి శతాధిక కవుల పరిచయ కార్యక్రమం చేపట్టారు. ఇలాంటి కార్యక్రమాన్ని తొలిసారిగా నిర్వహించారని గుర్తించిన ది హోప్ ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డు సంస్థ దీనిని ప్రపంచ రికార్డుగా నమోదు చేసి, ధ్రువీకరణ పత్రాన్ని స్థానిక ఎంఈఓకు పంపించింది. కాగా, మండల విద్యాశాఖకు ప్రపంచ రికార్డులో స్థానం దక్కడం పట్ల మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతోపాటు పలువురు ప్రజాప్రతినిధుల, అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

కాలేజీ కాసులేవి?



ప్రభుత్వం నుంచి నిధులకు నోచుకోని కొత్తగూడెంలోని కేఎస్‌ఎం కళాశాల



కేఎస్‌ఎమ్ నుంచి స్థలం సేకరించిన ప్రభుత్వం

- 80 ఎకరాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణం
- మొత్తం స్థలం విలువ రూ.464 కోట్లు
- నాలుగేళ్లుగా రూపాయి ఇవ్వని సర్కారు
- కళాశాలలో పేరుకుపోయిన సమస్యలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : తెలంగాణలో రెండో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీగా ఘనమైన చరిత్ర ఉన్న కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (కేయూసీఈ)కి రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున బకాయి పడింది. కాలేజీ ఆస్తులను ఇతర అవసరాలకు వాడుకున్న ప్రభుత్వం.. ఇక్కడ తిష్ట వేసిన సమస్యలను పరిష్కరించడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది.

390 ఎకరాల్లో కేఎస్‌ఎం..

సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్న కొత్తగూడెంలో 1976లో సుమారు 390 ఎకరాల్లో కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్(కేఎస్‌ఎం) పేరుతో ఇంజనీరింగ్ కాలేజీ ప్రారంభమైంది. ఆ తర్వాత 1994లో ఓయూ నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలోకి మారింది. ప్రస్తుతం ఈ కాలేజీలో గ్రాడ్యుయేషన్ విభాగంలో మైనింగ్, ఈఈఈ, కంప్యూటర్ సైన్స్ విభాగాలతో పాటు సెల్ఫ్ ఫైనాన్స్ కింద ఈసీఈ, ఐటీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అన్ని విభాగాల్లో కలిసి 250 సీట్లు ఉన్నాయి. వీటితో పాటు 2001 నుంచి ఎంబీఏ, ఎంసీఏ వంటి పీజీ కోర్సులు కూడా ప్రవేశపెట్టారు. భవిష్యత్‌లో మరిన్ని కొత్త కోర్సులు ఇక్కడ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

ఎకరం రూ.5.81 కోట్లు..

ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ జాతీయ రహదారి పక్కన ఉండటం, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం పట్టణాలకు దగ్గరగా ఉండడంతో ఇక్కడ స్థలాలకు మంచి ధర పలుకుతోంది. పైగా జిల్లా కార్యాలయాలన్నీ ఇక్కడే కొలువుదీరాయి. దీంతో భూముల ధరలు భారీగా పెరిగాయి. ఇక్కడ ప్రభుత్వ ధర ప్రకారమే ఎకరం విలువ రూ.5.81కోట్లుగా ఉంది. బహిరంగ మార్కెట్‌లో ఈ విలువ మరింత ఎక్కువగా ఉంటుంది. సర్కారు లెక్క ప్రకారమే 80 ఎకరాలకు సంబంధించి ఇంజనీరింగ్ కాలేజీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.464 కోట్లు చెల్లించాల్సి ఉంది. స్థలం తీసుకుని నాలుగేళ్ల గడిచినా ఇప్పటివరకు కాలేజీ ఖాతాలో ఒక్క రూపాయి కూడా జమ కాలేదు. ఈ మేరకు కాలేజీ యాజమాన్యం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తులు వెళ్లినా స్పందన లేదు.

80 ఎకరాలు తీసుకున్న సర్కారు..

ఖమ్మం జిల్లాను విభజిస్తూ కొత్తగూడెం కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం 2016లో కొత్తగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఏర్పాటు చేసింది. జిల్లాకు పరిపాలన భవనాల నిర్మాణం అవసరం కావడంతో కొత్తగూడెం – పాల్వంచ పట్టణాల మధ్యన జిల్లా కార్యాలయాల సమీకృత భవనం, ఎస్పీ ఆఫీసు, జిల్లా అధికారుల నివాస గృహాలు నిర్మించాలని నిర్ణయించారు. దీంతో ఇక్కడున్న కేఎస్‌ఎంకు చెందిన 50 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం తీసుకుంది. ఆ తర్వాత జిల్లాకు వైద్య కళాశాల మంజూరు కావడంతో అందుకు అవసరమైన 30 ఎకరాల స్థలాన్ని కూడా ఇక్కడి నుంచే సేకరించారు. మొత్తంగా వివిధ ప్రభుత్వ అవసరాల కోసం ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన 80 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం తీసుకుంది.

సమస్యలకు నిలయంగా..

ఓ వైపు యూనివర్సిటీ నుంచి నిధులు రాక, మరోవైపు ప్రభుత్వం పట్టించుకోక ఇంజనీరింగ్ కాలేజీ సమస్యలకు నిలయంగా మారింది. విద్యార్థుల హాస్టళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇండోర్ స్టేడియంలో సౌకర్యాలు లేవు. గ్రౌండ్‌లో వసతులు కరువయ్యాయి. ల్యాబ్‌లో సరిపడా పరికరాలు లేక, ఉన్న వాటిలో కొన్ని మరమ్మతులకు గురై ప్రాక్టికల్స్ అరకొరగానే జరుగుతున్నాయి. కాలేజీ నుంచి సేకరించిన స్థలం డబ్బు జమ చేస్తే కళాశాల అభివృద్ధికి తోడ్పడేది. పైగా ఇప్పుడు ఇంచుమించు ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు రెండూ ఒకే క్యాంపస్‌లో ఉన్నాయి. దీంతో విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. కానీ నిధుల లేమి కారణంగా సమస్యలే తప్ప.. అభివృద్ధి కార్యక్రమాలేవీ ఇక్కడ కనిపించడం లేదు. కళాశాలకు నూతన భవనాలు, ఫర్నిచర్, ఇతర పరికరాల కోసం రూ.75 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ నిధులతో పాటు ప్రభుత్వం బకాయి పడిన రూ.464 కోట్లు విడుదల చేస్తే కళాశాల అభివృద్ధి చెందే అవకాశం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు అంటున్నారు.

ప్రశాంతంగా ప్రారంభం



చండ్రుగొండ : పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు

- తొలిరోజు ఇంటర్ పరీక్షకు 7852 మంది హాజరు
- నిమిషం నిబంధనతో ముందుగానే చేరుకున్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో విద్యార్థులు ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. హాల్ టికెట్ నంబర్లు సరిచూసుకుని 15 నిమిషాల సమయం ఉండగాకే గదుల్లోకి వెళ్లారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు, వైద్య సిబ్బంది విధులు నిర్వహించారు. అయితే లక్ష్మీదేవిపల్లి మండలంలోని నలంద కళాశాల పరీక్ష కేంద్రంలో ఓ విద్యార్థికి ఫిట్స్ రావడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి మళ్లీ పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు. మిగిలిన అన్ని కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండానే ప్రశాంతంగా జరిగాయి. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండడంతో గుంపులుగా వచ్చేందుకు ఎవరినీ పోలీసులు అనుమతించలేదు. జిల్లా నోడల్ అధికారి సులోచనారాణి జిల్లాలోని ఏడు కేంద్రాలను తనిఖీలు చేశారు.

35 కేంద్రాల ఏర్పాటు..

జిల్లాలో ఇంటర్ పరీక్షల కోసం 35 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజున ప్రథమ సంవత్సర జనరల్ విద్యార్థులు 8,292 మందికి 7,852 మంది హాజరు కాగా 440 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2,469 మందికి 2,082 మంది హాజరు కాగా 387 మంది గైర్హాజరయ్యారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పటిష్టంగా తనిఖీలు నిర్వహించాయి. పాల్వంచలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పరీక్ష రాయాల్సిన ఓ విద్యార్థిని పొరపాటున లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల కేంద్రానికి వచ్చింది. అప్పటికే సమయం సమీపిస్తుండడంతో ఆందోళన చెందుతున్న విద్యార్థినిని గమనించిన పాల్వంచ పట్టణ ఎస్‌ఐ నరేష్ తన వాహనంలో కస్తూర్బా గాంధీ పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. పినపాక మండలం భట్టుపల్లి కేజీబీవీలో చదువుతున్న విద్యార్థిని కోరం శైలజ కడుపునొప్పితో తీవ్ర అనారోగ్యానికి గురై నడవలేని స్థితిలో ఉండగా పోలీసులు కుర్చీపై కూర్చోబెట్టి పినపాక ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలోకి తీసుకెళ్లి పరీక్ష రాయించారు.





పరీక్ష కేంద్రం వద్ద ఫిట్స్ వచ్చి పడిపోయిన విద్యార్థి

నేడు ఐటీడీఏ పీఓ పర్యటన

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని కొండరెడ్డి గ్రామాలైన రెడ్డిగూడెం, గోగుల పూడిలో గురువారం భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు పర్యటిస్తారని తహసీల్దార్ లూథరన్ విల్సన్ తెలిపారు. ఆయా గ్రామాల కొండరెడ్లతో పీఓ మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు.



పాల్వంచ రూరల్ : గురుకుల కళాశాల కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



పాల్వంచరూరల్ : గురుకుల కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

మంత్రి ప్రారంభించగానే..
శిలాఫలకం తొలగించారు



మంగళవారం మంత్రి అజయ్ ప్రారంభించిన శిలాఫలకం (ఇన్‌సెట్) బుధవారం కనిపించని శిలాఫలకం



రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఎంతో ఆర్భాటంతో ప్రారంభోత్సవం చేసిన శిలాఫలకం కనిపించకుండా పోయింది. అశ్వారావుపేట పాత ఎంపీడీవో కార్యాలయం వెనుక మంగళవారం మంత్రి ఆర్టీఏ సబ్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. కాగా మంత్రి ప్రారంభించిన ఒక రోజులోనే శిలాఫలకాన్ని కార్యాలయం వద్ద నుంచి తొలగించడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఎంవీఐ జయపాల్‌రెడ్డిని వివరణ కోసం 'సాక్షి' ఫోన్ ద్వారా ప్రయత్నించగా.. ఆయన అందుబాటులో లేరు.

–అశ్వారావుపేటరూరల్

ఆస్పత్రిలో శానిటేషన్ భేష్



ఆస్పత్రి ఆవరణలో కాయకల్ప బృందం సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో శానిటేషన్ పనులు బాగున్నాయని కాయకల్ప బృందం కో ఆర్డినేటర్ యాదయ్య అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అందించే వైద్య సేవలు, పరిసరాల్లో పారిశుద్ధ్య పనులపై బుధవారం కాయకల్ప బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సాధారణ, ప్రసూతి, అత్యవసర సేవలను బృందం సభ్యులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల వివరాలు ఆన్‌లైన్ చేయాలి

డీఈఓ సోమశేఖర శర్మ



వర్క్‌షాపును పరిశీలిస్తున్న డీఈఓ

పాల్వంచ: పాఠశాలల సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఈఓ సోమశేఖర శర్మ అన్నారు. స్థానిక డీఏవీ పాఠశాలలో యూడైస్ ప్లస్ వర్క్‌షాప్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొందరు ప్రధానోపాధ్యాయులు ఇప్పటికే ఆన్‌లైన్ చేశారని, వాటిని పరిశీలిస్తున్నామని తెలిపారు. పాఠశాల ప్రస్తుత పరిస్థితి, అవసరమైన మౌలిక వసతులు, పిల్లల సంఖ్య, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు, సౌకర్యాలు, అసౌకర్యాలు తదితర వివరాలు నమోదు చేస్తే ఉన్నతాధికారులు పరిశీలించే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ సతీశ్‌కుమార్, ఏపీఓ కిరణ్‌కుమార్, టెక్నికల్ పర్సన్ మోహన్, రిసోర్స్ పర్సన్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అద్దె యంత్రం.. ఆదాయ మార్గం

- వ్యవసాయ అనుబంధ యంత్రాల కొనుగోలుకు ప్రణాళిక
- మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో సీహెచ్‌సీ కేంద్రాలు
- ఎన్‌ఆర్‌ఎల్‌ఎం ద్వారా జిల్లాకు రూ.52.78 లక్షలు మంజూరు
- 16 మండలాల్లో అమలుకు ప్రతిపాదనలు



మహిళా సమాఖ్య సభ్యులు కొనుగోలు చేయనున్న వరి నాటేసే మిషన్లు (ఫైల్)

ఇల్లెందురూరల్: పలు పథకాలతో మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కృషి చేస్తోంది. సంస్థ పరిధిలోని పొదుపు సంఘాల మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి చర్యలు చేపడుతోంది. ఇప్పటికే గ్రామాల్లో మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసి పంటలు కొనుగోలు చేయిస్తోంది. ఇప్పుడు మండల మహిళా సమాఖ్యల ద్వారా వ్యవసాయ అనుబంధ యంత్ర పరికరాలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. జిల్లాలో ముందు నాలుగు మండలాల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ)లను ఏర్పాటుచేశారు. ఇది సత్ఫలితాలు ఇవ్వడంతో జిల్లా వ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని 16 మండలాల్లో సీహెచ్‌సీలు ఏర్పాటు కానున్నాయి.

సాగులో సాంకేతికత..

చాలా గ్రామాల్లో పాత పద్ధతుల్లోనే సాగు చేస్తుండడంతో సమయం, ఖర్చు ఎక్కువవుతున్నాయి. దీంతో కొందరు రైతులు సాంకేతిక విధానాన్ని అవలంబిస్తున్నారు. ఈ క్రమంలో వర్షాకాలం సీజన్‌లో యంత్ర పరికరాలకు డిమాండ్ పెరుగుతోంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం అద్దె యూనిట్లను మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసి వీటి ద్వారా లబ్ధి పొందేలా చర్యలు చేపట్టింది. మహిళా సంఘాలు ట్రాక్టర్, ఇతర పరికరాలు అద్దెకు తెచ్చి ఆదాయం ఆర్జించేలా ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే మణుగూరు, పినపాక, టేకులపల్లి, ములకలపల్లి మండలాల్లో పరికరాల కొనుగోలుకు రుణాలు మంజూరు చేశారు. వాటి ద్వారా వచ్చే ఆదాయంలో సభ్యులు నెలవారీగా వాయిదాలు చెల్లిస్తున్నారు. ఇదే పద్ధతిని జిల్లా వ్యాప్తంగా అమలు చేయనున్నారు.

నిధుల మంజూరు ఇలా..

జిల్లాలోని 16 మండలాల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ)లను ఏర్పాటు చేసి, ఒక్కో కేంద్రానికి రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పరిమితి విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ డబ్బుతో పొదుపు సంఘాల మహిళలు వ్యవసాయ అనుబంధ యంత్రాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. యంత్రాల కొనుగోలుకు మండల మహిళా సమాఖ్య సొంత నిధులు, బ్యాంకు రుణం ద్వారా మొత్తంగా 75 శాతం నిధులు సమకూర్చుకుంటే, ప్రభుత్వం 25 శాతం సబ్సిడీ ఇస్తుంది. ఇందుకోసం ఎన్‌ఆర్‌ఎల్‌ఎం ద్వారా జిల్లాకు రూ.52.78 లక్షలు మంజూరయ్యాయి. జిల్లాలోని 16 మండలాల్లో 210 వ్యవసాయ అనుబంధ యంత్రాల కొనుగోలుకు రూ.2,13,37,288 అవసరమని అధికారులు ప్రణాళిక రూపొందించారు.

రైతులకు ప్రయోజనం చేకూరేలా..

జిల్లాలోని 16 మండలాల్లో వ్యవసాయ అనుబంధ యంత్రాలను జిల్లా పర్చేజింగ్ కమిటీ (డీపీసీ) ఆధ్వర్యంలో కొనుగోలు చేసి సీహెచ్‌సీ నిర్వాహకులకు అప్పగిస్తారు. ఒక్కో యూనిట్‌లో ట్రాక్టర్, ప్యాడీ కటింగ్, స్ప్రేయర్లు, వరినాటే యంత్రాలు, కల్టివేటర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. మార్కెట్ ధర కంటే తక్కువకు రైతులకు అద్దెకు ఇవ్వాలని నిర్ణయించారు.

సద్వినియోగం చేసుకుంటాం



మండల మహిళా సమాఖ్యలకు 25 శాతం సబ్సిడీ, 25 శాతం మహిళా సమాఖ్య నిధులు, 50 శాతం బ్యాంకు రుణంతో సమకూరుస్తున్న వ్యవసాయ అనుబంధ యంత్రాలను సద్వినియోగం చేసుకుంటాం. రైతులకు యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించి అద్దె ప్రాతిపదికన సాగులో సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తాం.

– నాగమణి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

ప్రణాళిక సిద్ధం చేశాం



భద్రాచలం, చర్ల మినహా జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశాం. జిల్లా పర్చేజింగ్ కమిటీ పర్యవేక్షణలో యంత్రాలు కొనుగోలు చేస్తాం. ఏప్రిల్‌లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి యంత్రాలను సీహెచ్‌సీలకు అందుబాటులో ఉంచుతాం. ఇప్పటికే నాలుగు మండలాల్లో అద్దె యంత్రాలు మనుగడలో ఉన్నాయి.

– మధుసూదన్‌రాజు, డీఆర్‌డీవో

క్లుప్తంగా

పలువురికి పొంగులేటి పరామర్శ



పొంగులేటికి తాగునీటి సమస్యను వివరిస్తున్న మహిళలు

సుజాతనగర్: మండలంలోని నాయకులగూడెం, సింగభూపాలెం, పాత అంజనాపురం, చిమ్నాతండా, కొత్త అంజనాపురం, మేడేపల్లి, వేపలగడ్డ, సుజాతనగర్, మంగ్రితండా, సీతంపేట బంజర గ్రామాల్లో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల నూతనంగా వివాహం చేసుకున్న వధూవరులను ఆశీర్వదిస్తూ వారికి నూతన వస్త్రాలు బహుకరించారు. సింగభూపాలెం గ్రామంలో 10 వార్డులో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, బోరు ఏర్పాటు చేయాలని స్థానిక మహిళలు విన్నవించగా.. 10 రోజుల్లో బోరు ఏర్పాటు చేస్తానని పొంగులేటి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఊకంటి గోపాలరావు, లింగం పిచ్చిరెడ్డి, భాగం మోహనరావు, చిమట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామయ్య కల్యాణానికి 100 క్వింటాళ్ల తలంబ్రాలు



విరాళం అందజేస్తున్న దాతలు(ఫైల్)

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణానికి ఆలయ పాలక మండలి మాజీ సభ్యురాలు కస్తూరి కుమారుడు వేణు 100 క్వింటాళ్ల తలంబ్రాలను వితరణగా ఇచ్చారు. వేణు కుటుంబసభ్యులతో కలిసి ముక్కోటి ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీరామనవమికి ముత్యాల తలంబ్రాల కోసం అప్పుడే రూ.10 లక్షలు ఆలయ అధికారులకు అందజేయగా.. వారు బుధవారం హైదరాబాద్‌లో కొనుగోలు చేశారు. ఈ తలంబ్రాలను స్వామివారి కల్యాణం, ఆ తర్వాత భక్తులకు అందజేసే ప్యాకెట్లలో వినియోగించనున్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

జూలూరుపాడు: విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన పాపకొల్లు హైస్కూల్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఎస్.రామారావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయినట్లు ఎంఈఓ గుగులోత్ వెంకట్ తెలిపారు. ఉపాధ్యాయుడు రామారావు 6, 7వ తరగతులకు గణితం, మిగిలిన తరగతులకు ఫిజికల్ సైన్స్ బోధిస్తాడని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తగూడెంరూరల్: ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. లక్ష్మీదేవిపల్లి పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని క్రాంతినగర్ గ్రామానికి చెందిన సోడే భిక్షపతి(35) తన గ్రామం నుంచి బైక్‌పై రేగళ్ల వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో గట్టుమల్ల గ్రామం వద్ద ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సరిహద్దులో యువతి హత్య?

భద్రాచలంటౌన్: భద్రాచలం సరిహద్దు ప్రాంతమైన సుందరయ్యనగర్ కాలనీ శివారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హద్దుల్లో బుధవారం ఓ యువతి మృతదేహం లభించింది. మరో ప్రాంతంలో హతమార్చి మృతదేహాన్ని ఇక్కడ పడవేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. యువతి వయసు సుమారు 25 ఏళ్లు ఉండవచ్చని, ముఖం పూర్తిగా ఛిద్రం చేయడంతో గుర్తుపట్టే వీలులేకుండా ఉందని పోలీసులు తెలిపారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో పోలీస్ కస్టడీకి ఇద్దరు..

ఖమ్మంరూరల్: మండలంలోని తనగంపాడు రెవెన్యూ పరిధిలో నకిలీ డాక్యుమెంట్లతో భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులో అరెస్ట్ అయిన పాడేటి నాగేశ్వరరావు, వీరయ్యను పోలీసులు రెండు రోజుల విచారణ నిమిత్తం బుధవారం కస్టడీలోకి తీసుకున్నారు. భూమికి సంబంధించిన యజమాని బతికి ఉండగానే ఆయనతోపాటు భార్య మృతి చెందినట్లుగా నకిలీ డెత్ సర్టిఫికెట్లు తీసుకుని భూమి రిజిస్ట్రేషన్ చేయించుకుని విక్రయించిన కేసులో నిరంజన్‌రెడ్డితో పాటు గూడురుపాడుకు చెందిన పాడేటి నాగేశ్వరరావు, నేలకొండపల్లికి చెందిన ముత్తినేని వీరయ్య, కాసాని వెంకటేశ్వర్లు, వల్లభికి చెందిన ఐనాల రామారావును అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఈ కేసులో ఇంకా మరికొందరిని అరెస్ట్ చేయాల్సి ఉందని ప్రకటించిన పోలీసులు, లోతైన విచారణ కోసం నాగేశ్వరరావు, వీరయ్యను కస్టడీకి తీసుకున్నారు.

తాగునీటి ఎద్దడి రావొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, పక్కన అదనపు కలెక్టర్, సీఈఓ

- జెడ్పీ సమావేశంలో చైర్మన్ కోరం కనకయ్య
- పలు కీలక శాఖల పనితీరుపై సుదీర్ఘంగా చర్చ

చుంచుపల్లి: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సూచించారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అధికారులు, ప్రజాప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా వైద్య, ఆరోగ్యశాఖ, మిషన్‌భగీరథ, విద్యాశాఖ, పోడు భూములకు పట్టాలు వంటి అంశాలపై సమీక్షించారు. డీఎంహెచ్ఓ శిరీష జిల్లాలో కంటి వెలుగు, మహిళా ఆరోగ్య క్లీనిక్‌ల నిర్వహణ తీరును వివరించారు. కంటి వెలుగులో ఇప్పటివరకు 2.15 లక్షల మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. దీంతో జెడ్పీటీసీలు వెంకటరెడ్డి, వసంతక్క, చర్ల ఎంపీపీ కలుగజేసుకుని ఆస్పత్రుల్లో మందులు, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని, ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మిషన్ భగీరథపై సమీక్షలో పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు మాట్లాడుతూ చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందటం లేదని, అందినా సక్రమంగా సరఫరా కావడం లేదని పేర్కొన్నారు. దీంతో ఈఈలు నళిని, తిరుమలేష్ సమాధానం ఇస్తూ సంబంధిత గ్రామాల పరిధిలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యాశాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను డీఈఓ సోమశేఖర శర్మ వివరించారు. జూలూరుపాడు మండలంలో విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత ఇరిగేషన్, అటవీ శాఖల అభివృద్ధి పనులపై సమీక్ష జరిగింది.

ముందస్తు చర్యలు చేపట్టాలి

సమావేశంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వేసవిలో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జెడ్పీ సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం తమ పరిధిలో ఉన్న తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తేవాలని చెప్పారు. పాఠశాలల్లో మన ఊరు-మన బడి కార్యక్రమం పనులు చురుగ్గా సాగుతున్నాయని, అధికారులు ఈ పనుల తీరుతెన్నులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. ఏప్రిల్ చివరి నాటికి ఎంపిక చేసిన 368 పాఠశాలల మరమ్మతు పనులు పూర్తి చేయాలని, ఇవి పూర్తయ్యాక ప్రభుత్వం రెండో దశ పనులు చేపడుతుందని వివరించారు. పోడు పట్టాల కార్యక్రమం ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు క్లెయిమ్స్ స్వీకరించి గ్రామసభలు నిర్వహించారని తెలిపారు. అర్హుల జాబితా సిద్ధం చేస్తున్నామని త్వరలో అర్హులందరికీ పోడు పట్టాలను జారీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం జెడ్పీ సీఈఓ విద్యాలత 2023-24 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ రూ.60.30 కోట్లతో ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఆమోదం తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పదేళ్లుగా అనారోగ్య సమస్య

- పలు ఆస్పత్రులకు తిరిగినా, రూ.లక్షలు వెచ్చించినా నిర్ధారించని వైద్యులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు



శ్రావణి

సుజాతనగర్: తమ బిడ్డకు వచ్చిన వ్యాధి ఏమిటో తెలియక, రూ.లక్షలు ఖర్చు పెట్టినా తగ్గక తల్లిదండ్రులు మనోవేదనకు గురవుతున్నారు. వైద్యం అందించే స్తోమత లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలోని నాయకులగూడెం గ్రామానికి చెందిన చల్లా నాగేశ్వరరావు, నాగమణి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె శ్రావణికి ప్రస్తుతం 17 సంవత్సరాలు. ఈమెకు ఏడేళ్ల ప్రాయంలో జ్వరం వచ్చింది. అనంతరం చర్మంపై గడ్డలు ఏర్పడ్డాయి. అవి క్రమంగా పెద్దగా కావడంతోపాటు పగిలి చీము, రక్తం వస్తుండటంతో వైద్యం కోసం పలు ఆస్పత్రులకు తిరుగుతున్నారు. ఈ వ్యాధి మూలంగా పాఠశాలకు వెళ్లే అవకాశం లేక 5వ తరగతిలోనే శ్రావణి చదువుకు స్వస్తి పలికింది. తల్లిదండ్రులు కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ వంటి నగరాల్లోని ఆస్పత్రుల్లో చూపించినా వ్యాధి నయం కాలేదు. చికిత్సకు పదేళ్లలో సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. వ్యాధి నయంకాకపోగా ఆకలి మందగించి బిడ్డ రోజురోజుకూ నీరసించిపోతోంది. కాళ్లు చేతులు వంగే అవకాశం లేకపోవడంతో తల్లి సాయంతో మంచంపైకి వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. నిలబడాలన్నా..పడుకోవాలన్నా ఇంకొకరి సాయం అవసరం కావడంతో తల్లి కూలి పనులు మానుకుని బిడ్డ కోసం ఇంట్లోనే ఉంటోంది. మందులకు ప్రతి నెలా రూ. 5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని, పెన్షన్ కోసం దరఖాస్తు చేసి మూడేళ్లు గడుస్తున్నా మంజూరు కాలేదని తలిదండ్రులు వాపోతున్నారు. దాతలు స్పందించి తమ బిడ్డను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

దాతలు ఆర్థికసాయం చేయాలనుకుంటే..

చల్లా నాగేశ్వరరావు

ఖాతా నంబరు:	7304905882-7
ఐఎఫ్ఎస్‌సీ:	ఏపీజీవీ0004158
సెల్ :	9652712260

గ్రామపంచాయతీ ట్రాక్టర్ దగ్ధం



దుండగులు తగులబెట్టిన ట్రాక్టర్

బూర్గంపాడు: తాళ్లగొమ్మూరు గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు తగులబెట్టారు. ట్రాక్టర్‌ను గ్రామంలోని ఐటీసీ ఫంక్షన్‌హాల్ ప్రాంగణంలో నిలిపి ఉంచగా, దుండగులు నిప్పుపెట్టారు. మంటలను గమనించిన స్థానికులు భద్రాచలం అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. ఫైరింజన్‌తో వచ్చిన సిబ్బంది మంటలను ఆర్పారు. ఎస్సై సంతోష్ సంఘటనా స్థలాన్ని సందర్శించి, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఏటీఎం పాక్షికంగా దగ్ధం

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న ఏటీఎం మిషన్‌లో మంగళవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ జరిగి బ్యాటరీలతో పాటు ఏటీఎం మిషన్ బయట పాక్షికంగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో గమనించిన ఆర్టీసీ సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పారు. ఏటీఎం లోపల ఉంచిన నగదుకు ఎలాంటి మంటలు అంటుకోలేదు.



బస్టాండ్‌లో దగ్ధమైన ఏటీఎం

తండ్రి రెండో పెళ్లి చేసుకున్నాడని..

కుమార్తె ఆత్మహత్యాయత్నం

ఇల్లెందురూరల్: వారసుడు కావాలనే ఆకాంక్షతో తండ్రి రెండో పెళ్లి చేసుకోవడంతో మనస్తాపం చెంది కుమార్తె ఆత్మహత్యకు యత్నించిన ఘటన బుధవారం మండలంలోని బొల్లినగర్‌లో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని తిలక్‌నగర్ గ్రామపంచాయతీ బొల్లినగర్ గ్రామానికి చెందిన బండారు శ్రీనుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు రజిత, సౌజన్యలకు వివాహం జరిగింది. కాగా తాను మరో వివాహం చేసుకున్నానంటూ శ్రీను ఏడు నెలల క్రితం 22 ఏళ్ల యువతిని ఇంటికి తీసుకొచ్చాడు. దీంతో ఇద్దరు కుమార్తెలు ప్రశ్నించడంతోపాటు కులపెద్దలకు ఫిర్యాదు చేశారు. మూడు నెలలుగా వారి నుంచి న్యాయం జరగకపోగా, రెండో వివాహాన్ని పెద్దమనుషులు కూడా అంగీకరించారని తండ్రి చెప్పాడు. దీంతో రెండో కుమార్తె సౌజన్య మనస్తాపం చెంది యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం సిఫారసు చేశారు. ప్రస్తుతం సౌజన్య ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. తమకు న్యాయం చేయాలంటూ పెద్దకుమార్తె రజిత పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పినపాక: మండల పరిధిలోని తెర్లాపురం గ్రామ శివారులో నూపా రామయ్య పొలంలో బుధవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమయింది. 50 నుంచి 55 సంవత్సరాలు వయసుగల మహిళ మూడు రోజుల క్రితం చనిపోయి, మృతదేహం గుర్తు పట్టలేని స్థితిలో ఉందని ఏడూళ్ల బయ్యారం ఎస్ఐ నాగుల్ మీరా తెలిపారు. ఒంటిపై ఆకు పచ్చ రంగు చీర, బ్రౌన్ కలర్ జాకెట్ ఉన్నాయని పేర్కొన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోతల వేళ పూత



రెండో దశ పూతపై మందులు పిచికారీ చేస్తున్న రైతులు



వేంసూరు మండలం వెంకటాపురం నుంచి ఎగుమతికి సిద్ధం చేసిన తోతాపురి మామిడికాయలు

- మామిడి మార్కెట్ తెరిచే సమయాన మలిదశ పూత
- మొదటి దశలో 30శాతమే కాపు
- మందులు పిచికారీ చేస్తున్నా కానరాని ఫలితం
- గతేడాదితో పోలిస్తే తక్కువగానే పలుకుతున్న ధర

వేంసూరు: గత మూడేళ్ల నుంచి మామిడి రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఓ పక్క సరిగ్గా పూత లేక.. ఆ పూత కూడా నిలవక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే, మామిడి గిట్టుబాట ధర రాకపోవడంతో నష్టాలే ఎదురవుతున్నాయి. ఈసారి కూడా జిల్లాలో మొదటి దశ పూత కాయగా మారకపోగా.. ఆ కాయ మార్కెట్ తరలిస్తున్న నేపథ్యాన మలి దశ పూత మొదలైంది. ఈ పూత నిలిచేలా రూ.వేలు వెచ్చించి మరీ ఆశగా రైతులు పురుగుల మందులు పిచికారీ చేస్తూ ఫలితం కోసం ఎదురుచూస్తున్నారు.

పూత ఘనం.. కాపుశూన్యం

ఏడాది సీజన్ మొదట్లో మామిడి పూత బాగుండడంతో గత మూడేళ్ల నష్టాల నుంచి బయటపడినట్లేనని రైతులు ఆశించారు. కానీ ఆ పూత కాయగా మారకపోవడంతో వారికి నిరాశే ఎదురైంది. పూత ఎక్కువగా వచ్చినా వాతావరణంలో మార్పులతో పూత, పిందె దశలో రాలిపోయి 30 శాతానికి తక్కువ కాపు మాత్రమే నిలిచింది. ఈ మేరకు లీటర్ రూ.6వేలనుంచి రూ.10 వేల విలువైన మందులు పిచికారీ చేసినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు.

ఇప్పుడు మళ్లీ పూత

ఏటా మామిడి తోటల్లో రెండు విడతలుగా పూత రావడం సహజం. మొదటి దశ పూత ముగిసి పిందెలు ఏర్పడే దశలోనే రెండో విడత పూత వస్తుంది. కానీ ఈసారి నెలన్నర తర్వాత రెండో దశ పూత మొదలైంది. మొదటి దశలో పూతతో ఏర్పడిన కాయలను మార్కెట్‌కు తరలిస్తున్న నేపథ్యాన మళ్లీ పూత రాగా.. అవి ఎక్కువ శాతం పిందెలుగా ఏర్పడుతుండడంతో రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఎండ, అకాల వర్షాలతో భయం

రెండో దశలో వచ్చిన పూత పిందెలుగా ఏర్పడుతున్న నేపథ్యాన తెగుళ్ల బెడద రైతులను వేధిస్తోంది. పిందె కాయగా మారే సమయాన కాయకుళ్లు తెగులు వ్యాపించే అవకాశముందని చెబుతున్నారు. పూత, పిందె దశ నుంచి కాయ పక్వానికి రావడానికి 70నుంచి 80 రోజులు సమయం పట్టి, మే మూడో వారం నుంచి జూన్ మొదటి వారంలో కోతకు వస్తాయి. ఈసారి ఎండలు ఎక్కువగా ఉండే సూచనలకు తోడు అకాల వర్షాలు ఉంటాయని తెలుస్తుండగా రైతులు భారంగా ఆకాశం వైపు చూసున్నారు.

ధర దక్కేనా?

దేశవ్యాప్తంగా పరిశీలిస్తే తెలుగు రాష్ట్రాల్లో సాగయ్యే మామిడి మాత్రమే వేసవి సమయంలో అందుబాటులోకి వస్తుంది. దీంతో సహజంగానే మంచి డిమాండ్ ఉంటుంది. మార్చి మొదలు ఏప్రిల్, మే నెలల్లో తెలుగు రాష్ట్రాల్లోని మామిడిని విదేశాలకు సైతం ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం ఆలస్యంగా వచ్చిన రెండో దశ పూత కాయగా మారి మార్కెట్‌కు తీసుకెళ్లేలోగా ఉత్తర భారతదేశంలో సాగు చేసే దశేరి మామిడి అందుబాటులోకి వస్తుంది. దీంతో మన మామిడికి ధర తగ్గుతుందని చెబుతున్నారు. కాగా, గతేడాడితో పోలిస్తే ఈసారి మామిడి కాపు, ధర తక్కువగానే ఉన్నాయి. గతేడాది మార్చిలో బంగినపల్లి టన్ను రూ.లక్ష వరకు పలకగా ప్రస్తుతం వేంసూరు, తల్లాడ మండలాల్లో మొదలైన మార్కెట్లలో టన్ను ధర రూ.40వేలు, తోతాపురికి రూ19 వేలే పలుకుతుండడం గమనార్హం.


ఉమ్మడి జిల్లాల్లో సత్తుపల్లిలోనే అత్యధికం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పండే మామిడికి దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలకే కాక విదేశాలకూ ఎగుమతి చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 33,861 ఎకరాల్లో 10,406మంది రైతులు మామిడి సాగు చేస్తున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇక భద్రాద్రి జిల్లాలో 11,256 ఎకరాల్లో 2,724 మంది రైతులు మామిడి తోటలు సాగు చేశారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 45,117 ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా.. ఇందులో అత్యధికంగా సత్తుపల్లి నియోజకవర్గంలోనే సాగవుతోంది. ఈ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 19,432 ఎకరాలకుపైగా మామిడి తోటలు సాగవుతున్నట్లు అంచనా.

సత్తుపల్లి నియోజకవర్గంలో మామిడి తోటల వివరాలు

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
వేంసూరు	6,539	2,104
పెనుబల్లి	6,304	1,859
కల్లూరు	3,500	1,653
తల్లాడ	1,794	741
సత్తుపల్లి	1,295	507

ఈసారి దినదిన గండమే..



మొదటిదశ పూత అంతగా నిలవలేదు. ప్రస్తుతం పలుచోట్లు మామిడి కోతలు ఆరంభమయ్యాయి. ఇప్పుడు వచ్చిన రెండో దశ పూతతో దినదిన గండమే తప్ప ప్రయోజనం ఉండదు. మే ఆఖరులో ఉత్తరభారతంలో సాగు చేసే మామిడి వస్తుంది. దీంతో మనకు అంతగా ధర లభించదు.

– కూరపాటి చెన్నారావు, భరణిపాడు

సబ్సిడీపై పురుగు మందులు ఇవ్వాలి



మామిడి సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై పురుగు మందులు సరఫరా చేయాలి. మామిడి తోటల్లో తెగుళ్ల నియంత్రణకు రూ.6వేల నుంచి రూ.10వేల విలువైన మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. ధర లేనందున మామిడి రైతులకు ప్రభుత్వమే సాయమందించాలి.

– తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, వేంసూరు

సర్పంచ్ వేధిస్తున్నాడని ఆత్మహత్యాయత్నం



సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న ఉపేందర్

కూసుమంచి: దేవుడి గుడి నిర్మాణానికి భూమి ఇవ్వాలని సర్పంచ్ వేధిస్తుండడంతో కూసుమంచి మండలం నాయకన్‌గూడెంకు చెందిన యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు పాలెబోయిన ఉపేందర్ పురుగుల తాగే ముందు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో ఉపేందర్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. 2012లో తాను పొలం కొనుగోలు చేయగా, అందులో ఎకరం 7కుంటలు జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోయానని ఉపేందర్ తెలిపాడు. ఇక మిగిలిన ఎకరం 26 కుంటలు రోడ్డుకు రెండు వైపులా ఉండగా, 26 కుంటల భూమిలో ఆంజనేయస్వామి గుడి, ముస్లింలకు దర్గా నిర్మించారని పేర్కొన్నారు. ఇక మిగిలిన మూడు కుంటల భూమిలో ఇల్లు నిర్మించుకునేందుకు షెడ్డు వేస్తుంటే సర్పంచ్ కాసాని సైదులు అడ్డుకుని కంఠమేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఇవ్వాలని వేధిస్తుండడంతో చేసేదేం లేక ఆత్మహత్యకు పాల్పడుతున్నానని వెల్లడించారు. కాగా, పురుగులమందు తాగిన ఆయనను ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. ఇక ఘటనపై సర్పంచ్ సైదులు కూడా సోషల్ మీడియా ద్వారా వివరణ ఇస్తూ.. ఉపేందర్ స్వస్థలం కొత్తూరు అని, ఆయన కుటుంబం ఐదేళ్ల కిందట ఇక్కడ కొనుగోలు చేసిన భూమిని రహదారి నిర్మాణ సమయంలో అమ్ముకుని వెళ్లిపోయారని తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో అధికారుల అనుమతితోనే ఆలయాలు నిర్మిస్తుండగా, కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నాడని వెల్లడించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తిరుమలాయపాలెం: పంట దిగుబడి వచ్చే పరిస్థితి లేకపోవడంతో పెట్టుబడికి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పడమటితండా పరిధి రావిచెట్టుతండాకు చెందిన ఇస్లావత్ శ్రీను (37) మిర్చి, పత్తి పంటలు సాగుచేసినా చీడపీడలతో దిగుబడులు రాలేదు. దీంతో చేసిన అప్పులు పెరిగిపోయి, ముగ్గురు ఆడపిల్లలను ఎలా పోషించాలో తెలియక ఆయన ఈ నెల 10న ఇంట్లోనే పురుగులమందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై శ్రీను భార్య భద్రమ్మ ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

గుండాల: తల్లిదండ్రులు మందలించారని మనస్తాపం చెంది పురుగుల మందు తాగిన యువకుడు బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... ఆళ్లపల్లి మండలం మర్కోడు ఎస్సీ కాలనీకి చెందిన కీసర ప్రవీణ్(20) సోమవారం ఓ వివాహానికి వెళ్లొస్తూ కిందపడ్డాడు. అయితే కొద్ది రోజులుగా చెడు వ్యసనాలకు అలవాటుపడటంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంగళవారం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడి కళ్లను ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు దానం చేసినట్లు కుటుంబీకులు తెలిపారు.

క్షుద్ర పూజల కలకలం

చర్ల: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో క్షుద్రపూజలు నిర్వహించినట్లు బుధవారం తీవ్ర కలకల రేగింది. చర్లలోని బాయికుంటలో ఓ వ్యక్తి కొంతకాలం క్రితం ఒక పాత ఇంటిని కొనుగోలు చేసి అందులో నివాసముంటున్నాడు. ఆ ఇంట్లో రెండు రోజుల నుంచి గుప్త నిధుల కోసం క్షుద్ర పూజలు చేస్తున్నట్లు ప్రచారం జరిగింది. అక్కడకు వెళ్లి వివరాలు సేకరించగా.. తన భార్య అనారోగ్యానికి గురవడంతో శాంతి పూజ చేయిస్తున్నట్లు ఇంటి యజమాని తెలిపాడు.

అబద్ధాలు అచ్చేసిన రామోజీని సభకు పిలిచి విచారించాలి

తప్పు కేశవ్‌దో.. రామోజీదో తేలాలి

సభా హక్కుల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకోవాలి


- గవర్నర్‌ను అవమానించారంటూ ఈనాడు కథనంపై అధికారపక్ష సభ్యుల మండిపాటు
- గవర్నర్‌కు స్వాగతం పలికిన దృశ్యాల వీడియో సభలో ప్రదర్శన
- ఎల్లో మీడియా దుష్ప్రచారంపై సభలో ప్రత్యేక చర్చ జరపాలని విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: చట్ట సభను, రాజ్యాంగ వ్యవస్థను, గవర్నర్‌ను కించపరిచేలా అబద్ధాలను ఈనాడులో అచ్చేసి రామోజీరావు సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని, ఆయన్ను సభకు పిలిచి విచారించి, కఠిన చర్యలు తీసుకోవాలని శాసనసభలో అధికారపక్షం డిమాండ్ చేసింది. సీఎం రాకకోసం గవర్నర్ వేచి ఉండాలా అని టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నట్టు ప్రస్తావిస్తూ ఈనాడు రాసిన తప్పుడు కథనంపై బుధవారం శాసనసభ అట్టుడికింది. గవర్నర్‌ను కించపరుస్తూ ఈనాడు అచ్చేసిన కథనంపై సభా హక్కుల ఉల్లంఘన కింద ప్రివిలేజ్ కమిటీ విచారణ చేపట్టి కేశవ్ తప్పు మాట్లాడారా.. రామోజీ తప్పు రాశారా.. అనే విషయం తేల్చాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సభ్యులు పట్టుబట్టారు. ఈనాడు వార్త క్లిప్పింగ్‌లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించిన సభ్యులు.. ఎల్లో మీడియాను ఏకిపారేశారు. అలాంటి వ్యాఖ్యలు తాను చేయలేదని దమ్ముంటే నిరూపించాలని పయ్యావుల కేశవ్ అనడంపై అధికారపక్ష సభ్యులు మండిపడ్డారు. సభకు దమ్ము ధైర్యం అని సవాలు చేయవద్దని, కేశవ్ తప్పు మాట్లాడినా, ఈనాడు తప్పు రాసినా ప్రివిలేజ్ కమిటీ విచారణలో నిర్ధారణ అయితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ చర్చకు అడుగడుగునా టీడీపీ సభ్యులు అడ్డుతగలడంతో సభ దృష్టికి వాస్తవాలు తెచ్చేందుకు తొలిరోజున గవర్నర్‌కు స్వాగతం పలికిన వీడియోను ప్రదర్శించి సభ్యులకు వాస్తవాలు చూపించారు. అయినప్పటికీ పయ్యావుల కేశవ్ పదే పదే వాదనకు దిగడంతో గవర్నర్ విషయంలో ఆయన చేసిన కామెంట్ల వీడియో సైతం సభలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, అధికారపార్టీ నేతలు మాట్లాడారు.

రాజ్యాంగ వ్యవస్థను అవమానించడమే: మంత్రి బుగ్గన



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలకడంలో ప్రొటోకాల్ పాటించలేదంటూ అబద్ధపు రాతలు రాయడం రాజ్యాంగ వ్యవస్థను అవమానించడమే.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్వయంగా వెళ్లి గవర్నర్‌కు ఘనస్వాగతం పలికి సభలోకి తీసుకొచ్చారు. సీఎం వైఎస్ జగన్ ఉదయం 9.45 గంటలకు అసెంబ్లీకి వచ్చారు. 9.53కు గవర్నర్ వచ్చారు. గవర్నర్‌ను రిసీవ్ చేసుకున్న సీఎం 10.02 గంటలకు స్పీకర్ చాంబర్‌కు తీసుకొచ్చారు. గవర్నర్‌కు గొంతు ఇన్ఫెక్షన్ కారణంగా ఆయన అభ్యర్థన మేరకు కొంత సేపు ఆగి ఆయన రెడీ అయిన తర్వాత గౌరవ సభలోకి తీసుకొచ్చాం. ప్రభుత్వ పనితీరు, విజన్‌ను గవర్నర్ చదివితే.. ఆ ప్రసంగాన్ని సైతం టీడీపీ సభ్యులు చాలా హేళన చేశారు. తప్పుడు వార్తలతో గౌరవ సభను, గవర్నర్‌ను అవమానిస్తూ కథనాలు రాసిన ఈనాడుపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా స్పీకర్‌ను కోరుతున్నా.

ఆ రాతలు గవర్నర్, సీఎంలను అవమానపరిచేవే..

- ఈనాడు రాతలను సీరియస్‌గా పరిగణించాలి
- స్పీకర్ తమ్మినేని సీతారాం రూలింగ్

సాక్షి, అమరావతి: సీఎం కోసం గవర్నర్ ఎదురు చూడాలా? అంటూ ఈనాడు పత్రికలో వచ్చిన కథనాన్ని చాలా సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గవర్నర్‌కు స్వయంగా ముఖ్యమంత్రి సాదర స్వాగతం పలికినప్పటికీ, అవాస్తవ అంశాలతో టీడీపీ సభ్యుడు పయ్యావుల కేశవ్ మాట్లాడినట్లుగా ఈనాడు ప్రచురించిన కథనంపై స్పీకర్ తమ్మినేని రూలింగ్ ఇస్తూ.. గవర్నర్, సీఎం పదవుల ఔన్నత్యాన్ని, మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్‌తో పాటు మొత్తం రాజ్యాంగ వ్యవస్థలను అవమానపరిచే ఆ రాతలపై స్పష్టమైన, కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. బుధవారం సభలో స్పీకర్ మాట్లాడుతూ.. ''గవర్నర్ కార్యక్రమంలో నేనే ప్రత్యక్ష సాక్షిని. సీఎం, నేను, మండలి చైర్మన్ వెళ్లి ఆయనను సగౌరవంగా రిసీవ్ చేసుకున్నాం. గవర్నర్ కార్యాలయం నుంచి వచ్చిన డైరెక్షన్ ప్రకారమే గవర్నర్ స్పీకర్ చాంబర్ వద్ద ఆగి లోపలికి వచ్చి గొంతు సమస్యకు వేడి నీటిని తాగి సభకు బయలుదేరారు (గవర్నర్ కార్యాలయం డైరెక్షన్ వివరాలను స్పీకర్ సభలో చదివి వినిపించారు). వాస్తవం ఇలా ఉంటే, ఈ రోజు ఈనాడులో తప్పుడు కథనం చూశాక, ఇది చాలా సీరియస్‌గా పరిగణించాల్సిన అంశం అని భావిస్తున్నాను. మొత్తం రాజ్యాంగ వ్యవస్థలను అవమాన పరిచే ఈ రాతలను సభ సీరియస్‌గా తీసుకుంటుంది. గవర్నర్ పట్ల అనుచితమైన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయం కాదు. తప్పు కేశవ్‌దా, పత్రికదా అనే విషయం ప్రివిలేజ్ కమిటీ సిఫార్సులు సూచిస్తాయి. ఆ మేరకు చర్యలు తీసుకుంటాం. ప్రివిలేజ్ కమిటీ హియరింగ్స్ తర్వాత తప్పనిసరిగా సభలో ప్రకటన చేస్తాను. ఆ మాటలు మాట్లాడిన సభ్యుడు అన్నీ ప్రివిలేజ్ కమిటీ ముందు చర్చించవచ్చు'' అని చెప్పారు.

బీజేపీ.. ఐటీ, ఈడీ, సీబీఐని నమ్ముకుంది!

- ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి, బురద జల్లుతున్నారు
- బీజేపీ సమాధులు తవ్వితే బీఆర్‌ఎస్ పునాదులు వేస్తోంది
- మంచిర్యాల జిల్లా పర్యటనలో మంత్రి హరీశ్‌రావు విమర్శలు



సుందరీకరణ పనుల ప్రారంభోత్సవంలో హరీశ్‌రావు, ఇంద్రకరణ్, బాల్క సుమన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/చెన్నూర్: 'బీజేపీ ప్రజలను కాకుండా ఐటీ, ఈడీ, సీబీఐని నమ్ముకుని గెలవాలని చూస్తోంది. ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి, బురద జల్లి, అబద్ధాలను ప్రచారం చేస్తోంది' అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. బుధవారం ఆయన దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, దివాకర్‌రావు, మంచిర్యాల జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలసి మంచిర్యాల, చెన్నూరు నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార సభలో మాట్లాడుతూ.. బీజేపీ చేసిన ఒక్క మంచి పని ఉందా? అని ప్రశ్నించారు. ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టడం, సంస్థలు అమ్మేయడం చేస్తోందని దుయ్యబట్టారు. ఇక్కడి రెండు బొగ్గు బ్లాక్‌లను వేలం వేసి, సింగరేణిని అమ్మాలని చూస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. సమాధులు తవ్వే బీజేపీ కావాలో, పునాదులు వేసే బీఆర్‌ఎస్ కావాలో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. అభయహస్తం వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రం నుంచి కరువును తరిమేశారని కొనియాడారు. చెన్నూరు ఎత్తిపోతలతో ఇక్కడి రైతాంగానికి రెండు పంటలకు అవకాశం కలుగుతుందని హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు.

పేపర్ లీక్‌పై ఉద్యమించండి

- రాష్ట్ర బీజేపీకి అధిష్టానం ఆదేశం!
- లీక్‌పై అధ్యయనానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని, కమిషన్ నిర్లక్ష్య ధోరణిని ఎండగట్టాలని రాష్ట్ర నాయకత్వానికి బీజేపీ జాతీయ నాయకత్వం ఆదేశించినట్టు సమాచారం. లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో ముడిపడిన ఉద్యోగాల భర్తీ విషయంలో కేసీఆర్ సర్కార్ అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని, ఆశ్రిత పక్షపాతాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా వివిధ రూపాల్లో ఆందోళన, ఇతర కార్యక్రమాలను చేపట్టాలని సూచించినట్లు తెలిసింది. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నది విద్యార్థి లోకం, యువతరమే కాబట్టి, వీరి మద్దతును కూడగట్టే దిశలో ముందుకెళ్లాలని జాతీయ నాయకత్వం ఆదేశించినట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా జాతీయ పార్టీ ఆదేశాలతో కదిలిన రాష్ట్ర నాయకత్వం.. లీకేజీ వ్యవహారంపై అధ్యయనానికి వివిధ రంగాల్లో అనుభవమున్న పార్టీ నేతలతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు సీహెచ్ విఠల్ కన్వీనర్‌గా ఏర్పాటు చేసిన ఈ కమిటీలో.. మాజీ ఐఏఎస్ చంద్రవదన్, మాజీ ఐపీఎస్ కృష్ణప్రసాద్, లీగల్ కేసుల్లో అనుభవమున్న ఎస్.రామచంద్రరావు, కరుణా గోపాల్, ఎన్‌డీఎంఏ మాజీ సభ్యుడు మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, జర్నలిస్ట్ ఎస్.కుమార్ సభ్యులుగా ఉన్నారు.

నేడు టాస్క్‌ఫోర్స్ కమిటీ భేటీ... : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అధ్యక్షతన గురువారం పార్టీ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ భేటీ కానుంది. లీకేజీ అంశంపై ఎలా ముందుకెళ్లాలి? ఏయే విషయాలపై దృష్టి కేంద్రీకరించాలి? సాంకేతిక అంశాలు ఎలా పరిశీలించాలి? తదితర అంశాలపై చర్చించనున్నారు. లీకేజీలో ఎవరెవరి ప్రమేయముందో తేల్చడంతో పాటు పార్టీ పరంగా చేపట్టాల్సిన ఆందోళన కార్యక్రమాలు ఖరారు చేయనున్నట్లు తెలిసింది.

ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా?

టీఎస్‌పీఎస్సీ ఎదుట ఆందోళన చేసిన బీజేవైఎం కార్యకర్తలపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి అరెస్ట్ చేయడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న వాళ్లను వదిలేసి న్యాయం కోసం పోరాడుతున్న వారిని అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రశ్నపత్రాల లీకేజీతో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలు ప్రమాదంలో పడ్డాయని, అందుకు కారకులైన వారిని వదిలేసి పోరాడుతున్న వారిపై కేసులు పెట్టడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. లీకేజీ అంశంపై ప్రభుత్వం 'సిట్'ఏర్పాటు చేయడాన్ని సంజయ్ తప్పుపట్టారు. గతంలో నయీం కేసు, డ్రగ్స్ కేసు, డేటా చోరీ సహా సిట్‌కు అప్పగించిన కేసులన్నీ నీరుగారిపోయాయని గుర్తుచేశారు.

ప్రశ్నించే వారి గొంతునొక్కడమేంటి: డీకే అరుణ

పోటీ పరీక్షలను సక్రమంగా నిర్వహించడం చేతగాని కేసీఆర్ ప్రభుత్వం ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కడమేమిటని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఓ ప్రకటనలో నిలదీశారు.

ఏపీని విడగొట్టింది కేసీఆర్ కాదు... కాంగ్రెస్

బీఆర్‌ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విడగొట్టింది కేసీఆర్ కాదని, కాంగ్రెస్ పార్టీ అని బీఆర్‌ఎస్ ఏపీ శాఖ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఏపీని కాంగ్రెస్ విడగొడితే బీజేపీ సహకరించిందని, వైసీపీ, టీడీపీ లేఖలు ఇచ్చాయని గుర్తు చేశారు. కర్నూల్, నంద్యాల, ప్రకాశం జిల్లాలకు చెందిన పలువురు నాయకులు బుధవారం తెలంగాణ భవన్‌లో తోట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తెలంగాణ మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టిన కేసీఆర్ పార్టీలో ఎందుకు చేరారని కొందరు తనను అడుగుతున్నారని, అందుకే ఈ వివరణ ఇస్తున్నట్లు చెప్పారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై కేసీఆర్ గొంతెత్తారని వివరించారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఊహించని విధంగా అభివృద్ధి చెందిందని కొనియాడారు. వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ తరహా అభివృద్ధి ఏపీలో కావాలని అక్క డి ప్రజలు కోరుకుంటున్నారని, అందుకే పలు వురు నాయకులు తమ పార్టీలో చేరుతున్నార ని చెప్పారు. కార్యక్రమంలో కర్నూల్ కార్పొరేటర్ ముస్తాక్, సాయితేజ్, రామాపురం ప్రకాశం, ఎంఆర్‌పీఎస్ కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు రాధమ్మ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలపై ఫిర్యాదు చేసిన షర్మిల



రేఖాశర్మకు వినతి పత్రం ఇస్తున్న షర్మిల తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ : బీఆర్‌ఎస్ నేతలపై వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఢిల్లీలో బుధవారం జాతీ య మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మను వైఎస్సార్ టీపీ నాయకులతో పాటు వైఎస్ షర్మిల కలిశారు. ఈ సందర్భంగా తనను బీఆర్‌ఎస్ నేతలు అసభ్యకరంగా దూషించిన వీడియోలను మహిళా కమిషన్‌కు చూపించారు. మహిళలనే గౌరవం బీఆర్‌ఎస్ పార్టీకి లేదని, పాదయాత్ర చేస్తున్న తనపై దాడులకు దిగుతున్నారని, బహిరంగంగా ఎలా బయట తిరుగు తావో చూస్తాం అంటూ బెదిరిస్తున్నార ని రేఖా శర్మ వివరించారు. తెలంగాణలో మహి ళలకు గౌరవం, రక్షణ లేదని...ఆడవాళ్లంటే వ్రతాలు చేసుకోవాలని మంత్రి కేటీఆర్ వ్యా ఖ్యానిస్తున్నారని షర్మిల తెలిపారు. ప్రజా సమస్యలను తను ఎత్తి చూపిస్తే శిఖండి అని వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారని షర్మిల మండిపడ్డారు. తను ఇచ్చిన ఫిర్యాదుపై రేఖా శర్మ సానుకూలంగా స్పందించారని.. అసభ్యకర పదజాలంతో దూషించిన వారిపై చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారని మీడియాకు తెలిపారు.

జిల్లా వార్తలు

యాతాలకుంటలో ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ



అటవీ ప్రాంతంలో పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ, అధికారులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం యాతాలకుంటలో అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ నాభూషణం బుధవారం పర్యటించారు. వేసవి దృష్ట్యా వన్యప్రాణులకు నీటి సౌకర్యం ఏర్పాటుకు ఉన్న సౌకర్యాలు, అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ లైన్స్ ఏర్పాటు తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. ఆతర్వాత పెనుబల్లి మండలం భువన్నపాలెంలో వాచ్‌టవర్‌ను పరిశీలించారు. డీఆర్‌ఓ నాజూర్‌బీ, ఎఫ్‌బీఓ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

19న భద్రాచలంలో 'పొంగులేటి' సమ్మేళనం'

భద్రాచలం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యాన ఈ నెల 19న భద్రాచలంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. మార్కెట్ యార్డులోని టీవీ స్టేషన్ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు సమ్మేళనం మొదలుకానుంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

'లక్కీ డ్రా'మెసేజ్‌లకు స్పందించకండి



శరత్‌చంద్ర పవార్

మహబూబాబాద్‌రూరల్: కౌన్ బనేగా కరోడ్‌పతి (కేబీసీ) లక్కీ డ్రా పేరుతో సైబర్ నేరగాళ్లు ఫోన్, వాట్సాప్‌లో పంపించే మెసేజ్‌లకు స్పందించి మోసపోవద్దని మహబూబాబాద్ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సూచించారు. మహబూబాబాద్ ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో కేబీసీ లాటరీ పేరుతో వాట్సాప్ వేదికగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. బహుమతుల పేరిట వచ్చే మెసేజ్‌లకు స్పందిస్తే లింక్ పంపి కొంత డబ్బు చెల్లించాలని నమ్మబలుకుతున్నారని చెప్పారు. ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కాగా, మోసపోయిన వారు ఎన్సీఆర్పీ పోర్టల్‌లో లేదా హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

వెండితెరపై 'గుమ్మడి' బయోగ్రఫీ

- త్వరలో షూటింగ్ ప్రారంభిస్తామని డైరెక్టర్ వెల్లడి
- కాచనపల్లి అమరవీరుల స్థూపం వద్ద నివాళులు



కాచనపల్లిలో అమరవీరుల స్థూపం వద్ద మాట్లాడుతున్న డైరెక్టర్ పరమేశ్, పక్కన గుమ్మడి నర్సయ్య తదితరులు

గుండాల: పాతికేళ్ల పాటు శాసనసభ్యుడిగా ఉన్నా, సాదాసీదా జీవనం సాగిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య జీవిత చరిత్ర ఇతివృత్తంగా 'గుమ్మడి నర్సన్న' పేరుతో సినిమా రూపకల్పనకు సన్నాహాలు చేస్తున్నారు. షూటింగ్ ప్రారంభానికి ముందు సినిమా దర్శకుడు పరమేశ్, నిర్మాత మహేశ్‌తో పాటు గుమ్మడి నర్సయ్య, ప్రజాపంథా పార్టీ నేతలు గుండాల మండలం కాచనపల్లిలో అమరవీరుల స్మారక స్థూపం వద్ద బుధవారం నివాళులర్పించారు. అనంతరం డైరెక్టర్ పరమేశ్ విలేకరులతో మాట్లాడుతూ గుమ్మడి నర్సయ్య చేసిన పోరాటాలు, ప్రజాప్రతినిధిగా చేపట్టిన అభివృద్ధి పనులపై రెండేళ్లపాటు అధ్యయనం చేశామని చెప్పారు. దేశం గర్వించే విధంగా సినిమా రూపొందిస్తామని, త్వరలోనే వివరాలు వెల్లడించి షూటింగ్ ప్రారంభిస్తామని తెలిపారు. ఇంకా కార్యక్రమంలో నిర్మాత మహేశ్, సంగీత దర్శకుడు చరణార్జున్, సినిమా బాధ్యులు, నాయకులు చంద్ర అరుణ, చిన చంద్రన్న, ప్రభన్న, అజ్మీరా బిచ్చ, కాంపాటి పృథ్వీ, ఆర్.బోసు, బొర్ర వెంకన్న, శంకర్, శాంతయ్య, చంద్రయ్య, గణేశ్, రాఘవులు, రామచందర్, సుగుణారావు, ప్రసాద్, అఖిల్, విశ్వన్, బాషా పాల్గొన్నారు.

తెలంగాణలో మతతత్వ బీజేపీని అడ్డుకుంటాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం



మాట్లాడుతున్న వీరభద్రం, పక్కన నాయకులు

తిరుమలాయపాలెం: తెలంగాణలోకి మతతత్వ బీజేపీ రాకుండా అడ్డుకుని తీరుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. మండలంలోని పిండిప్రోలులో బుధవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో కుల మతాలకతీతంగా ప్రజలు జీవనం సాగిస్తుంటే మతతత్వం పేరుతో చీల్చి వైరుధ్యాలు సృష్టించేందుకు బీజేపీ యత్నిస్తోందని ఆరోపించారు. దీనికి తోడు దేశంలోని ప్రభుత్వ సంస్థలు, సంపదను కార్పొరేట్ శక్తులకు మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అప్పగిస్తోందని మండిపడ్డారు. బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు ఈనెల 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజా చైతన్య బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు తమ్మినేని తెలిపారు. సమావేశంలో నాయకులు కొమ్ము శ్రీను, నిర్మల్‌రావు, సురేశ్, వేగినాటి వెంకట్రావు, ప్రసాద్, పద్మనాభుల సుధాకర్, పాపారావు, రవి, చల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముంతమామిడి @రూ.60





విక్రయానికి సిద్ధంగా ఉన్న ముంతమామిడి

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం నగరంలో ముంత మామిడి విక్రయాలు ఆరంభమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లికి చెందిన ఈర్ల నారాయణ ఖమ్మం జెడ్పీసెంటర్ వద్ద ముంత మామిడి విక్రయిస్తూ బుధవారం కనిపించాడు. సైజ్ ఆధారంగా ఒక్కో కాయ రూ.60 వరకు విక్రయిస్తుండగా.. ఇప్పుడే సీజన్ ఆరంభం కావడంతో ప్రజలు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారని తెలిపాడు.

నాణ్యమైన సేవలు పొందాలి

మహబూబాబాద్ అదనపు కలెక్టర్ డేవిడ్

మహబూబాబాద్: వినియోగదారులు నాణ్యమైన సేవలు పొందేలా అవగాహన కలిగి ఉండాలని మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ తెలిపారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వినియోగదారుల పరిరక్షణ చట్టం, సేవలు, ఫిర్యాదులు, బాధ్యతలపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అవగాహన కరపత్రాలు ఆవిష్కరించిక అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో వినియోగదారుల సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండి నష్టపోకుండా కాపాడుకోవాలని సూచించారు. ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాసులు మాట్లాడగా, డీసీఎస్‌ఓ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్, తదితరులు

ఘనంగా ఎంపీ నామా పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు, నాయకులు

ఖమ్మంవైరారోడ్: బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పుట్టినరోజు వేడుకలను జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేశాక ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 265 మంది రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ప్రారంభించారు. తర్వాత నామ సేవా సమితి ఆధ్వర్యాన ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నిత్యం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్న ఎంపీ నాగేశ్వరరావు, తన తండ్రి నామా ముత్తయ్య పేరిట ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. కార్యక్రమాల్లో రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు బొమ్మెర రామ్మూర్తి, పగడాల నాగరాజు, కనకమేడల సత్యనారాయణ, బెల్లం వేణుగోపాల్, ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీ వై.వరప్రసాద్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్యయాదవ్‌తో పాటు బాణాల వెంకటేశ్వర్లు, వీరన్న, బుడిగం శ్రీను, పోట్ల శ్రీను, బత్తుల శ్రీనివాసరావు, తన్నీరు రవి, మోరంపూడి ప్రసాద్, వాకదాని కోటేశ్వరరావు, గోడ్డేటి మాధవరావు, చిత్తారు సింహాద్రియాదవ్, ఉప్పునూతల నాగేశ్వరరావు, గారపాటి సూర్యం, గారపాటి అనురాధ, చింతలచెర్వు లక్ష్మి, మేదరమెట్ల స్వరూపారాణి, రాములమ్మ, పాల్వంచ రాజేశ్, చీకటి రాంబాబు, రేగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రద్దు, కుదింపు మరికొన్ని రోజులు..

ఖమ్మంమామిళ్లగూడెం: విజయవాడ వైపు గల గంగినేని – ఎర్రుపాలెం వద్ద మూడో రైల్వే లైన్ పనుల దృష్ట్యా ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడంతోపాటు కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను అధికారులు కుదించారు. అయితే, ఈ నిర్ణయం 23వ తేదీ వరకు అమల్లో ఉంటుందని అధికారులు వెల్లడించారు. విజయవాడ – డోర్నకల్ (07756), డోర్నకల్ – విజయవాడ (07755), విజయవాడ – భద్రాచలంరోడ్ (07979), భద్రాచలం రోడ్- విజయవాడ (07278) ప్యాసింజర్ రైళ్లను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, సికింద్రాబాద్ – గుంటూరు (17201), గుంటూరు – సికింద్రాబాద్ (17202) మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ కాజీపేట వరకు, గుంటూరు – సికింద్రాబాద్ (12705), సికింద్రాబాద్ – గుంటూరు (12706) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 22వ తేదీ వరకు ఖమ్మం వరకు రాకపోకలు సాగిస్తాయి.

పలురైళ్ల దారి మళ్లింపు

మూడో రైల్వే లైన్ పనుల నేపథ్యాన పలు రైళ్లను నడికుడి మీదుగా మళ్లించనున్నారు. సికింద్రాబాద్ – విశాఖపట్నం (12747) గరీబ్‌రథ్ ఈ నెల 19, 20, 21వ తేదీల్లో యశ్వంత్‌పూర్ – టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (18112) ఈ నెల 19వరకు, విశాఖపట్నం – సికింద్రాబాద్ గరీబ్‌రథ్ (12739) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19, 20, 21వ తేదీల్లో, కాకినాడటౌన్ – లింగంపల్లి(12775) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19, 20, 21వ తేదీల్లో, లింగంపల్లి – కాకినాడ టౌన్ (12776) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20వ తేదీ వరకు, ముంబై – భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019)ను ఈ నెల 21వరకు నడికుడ మార్గంలో నడిపిస్తామని అధికారులు వెల్లడించారు.

ప్రతిభ, పట్టుదలతోనే విజయావకాశాలు



అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రతిభకు పట్టుదల తోడైతే ఏదైనా సాధించవచ్చని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు తెలిపారు. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ప్రైవేట్ రంగంలో ఉపాధి ఎంచుకుని, స్వయం ఉపాధిపైనా దృష్టి సారించాలని సూచించారు. 'టామ్‌కమ్' ద్వారా విదేశీ ఉద్యోగాలకు అభ్యర్థుల నమోదు కోసం భద్రాద్రి కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ రంగ సంస్థ అయిన టామ్‌కామ్ ద్వారా విదేశాల్లో ఉపాధి నిమిత్తం వెళ్తే మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కాగా, ఐటీఐ వివిధ ట్రేడ్లు పూర్తి చేసిన అభ్యర్థులు 320 మంది హాజరు కాగా, 150 మందిని ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేసినట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి వేల్పుల విజేత తెలిపారు. టామ్‌కామ్ ప్రతినిధులు శ్రావణి, విశాల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.